# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 286 సోమవారం 20 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# బెర్తుల కోసం లాబీయింగ్

- చోటు దక్కని సీనియర్లు ఈసారి మంత్రి పదవులపై కన్ను
- ఏ ఒక్క అవకాశాలను వదులుకోవద్దనే ఆలోచన
- తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం కాంగ్రెస్ పెద్దలతో పలువురు సీనియర్లు మంతనాలు జరిపినట్టు సమాచారం
- జూన్ చివరలో కేబినెట్ విస్తరణ ఉంచవచ్చనే సంకేతాలు
- బీసీ, ముదిరాజ్, మైనార్టీ వర్గాలతో కలిసి మొత్తం ఆరుగురికి అవకాశం ఇవ్వడం ఖాయం
- సరైన పనితీరు కనబరచని మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశాలు లేకపోలేదని సమాచారం



హైదరాబాద్

రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో బెర్త్‌ల కోసం అప్పుడే లాబీయింగ్ మొదలైందా? చోటు దక్కని సీనియర్లు ఈసారి మంత్రి పదవులపై కన్నేశారా? దీనికోసం ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని భావిస్తున్నారా? వివిధ జిల్లాల నుంచి కీలక నేతలు రేసులో ఉన్నారా? తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం కాంగ్రెస్ పెద్దలతో పలువురు సీనియర్లు మంతనాలు జరిపినట్టు సమాచారం. కాకపోతే లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తర్వాత ఈ అంశం ఓ కొలిక్కిరావచ్చని తెలుస్తోంది. అంతా అనుకున్నట్లు జరిగితే జూన్ చివరలో కేబినెట్ విస్తరణ ఉంచవచ్చనే -మిగతా3లో



# ధరణిలో.. అన్ని సమస్యలే

- సమస్యల పరిష్కారమే ప్రధానం
- ధరణిపై దూకుడు పెంచిన సర్కార్.. సీఎం రేవంత్ కీలక సూచనలు..
- ధరణి పోర్టల్ సమస్యలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పెషల్ ఫోకస్
- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వరుసగా భేటీలు
- జూన్ 4వ తేదీలోగా రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న లక్ష ఫిర్యాదులను పరిష్కరించాలి

హైదరాబాద్

తెలంగాణలో ధరణి కమిటీ మరింత దూకుడు పెంచింది. సెక్రటేరియట్‌లో మరోసారి సమావేశమైన ధరణి కమిటీ.. సమస్యల పరిష్కారానికి రేవంత్ సర్కార్‌కు పలు కీలక సూచనలు చేసింది. ధరణి పోర్టల్ సమస్యలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం -మిగతా3లో

## ఆ రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి 50 సార్లు ఆలోచిస్తారు..



- ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు
- కాంగ్రెస్ మావోయిస్ట్ భాష ఉపయోగించడం వల్ల ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆలోచిస్తారు
- ఆ పార్టీ కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిస్తోంది
- లోక్‌సభ స్థానాలను పూర్వీకుల ఆస్తులుగా పరిగణిస్తోంది
- దేశ వ్యాప్తంగా ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ విఫలమైంది



# గ్రీన్ సిగ్నల్.. కానీ!

- రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి ఈసీ గ్రీన్‌సిగ్నల్
- జూన్ 4వ తేదీలోపు చేయాల్సిన అత్యవసర విషయాలపైనే చర్చించాలని షరతు
- రైతు రుణమాఫీ, ఉమ్మడి రాజధాని అంశాలపై చర్చించకూడదని స్పష్టం
- ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు భేటీలో పాల్గొనకూడదు
- శనివారం జరగాల్సిన రాష్ట్ర కేబినెట్ భేటీ వాయిదాపడిన విషయం

హైదరాబాద్

తెలంగాణ మంత్రివర్గ సమావేశ నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. సమావేశంలో చర్చించే అంశాలపై మాత్రం షరతులు విధించింది. దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. జూన్ 1వ తేదీన ఏడో విడత లోక్ సభ ఎన్నిక ముగియనుంది. 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడుతారు. తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో అత్యవసర విషయాలు మాత్రమే చర్చించాలని ఈసీ కండీషన్ పెట్టింది. రాష్ట్ర మంత్రివర్గ -మిగతా3లో

# ఇవాళ తెలంగాణ ఆగమైంది



- అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం..
- అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటమికి రెండు కారణాలు ఉన్నాయి
- ఒకటి చేసిన పనిని చెప్పుకోలేదు
- రెండోది కొన్నివర్గాలను దూరం చేసుకోవడంతోనే ఓడిపోయాం
- మా పాలనలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేశాం
- రుణమాఫీపై కాంగ్రెస్ పూటకో మాట మారుస్తున్నది
- కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ఇచ్చి అన్నింటిని మర్చిపోయిది
- గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు వేసే ముందు పార్టీతో పాటు అభ్యర్థి గుణగణాలను చూడాలి

యాదాద్రి

తెలంగాణలో ఇప్పటి వరకు జరిగిన గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించిందని.. ఈ ఎన్నికల్లోనూ గెలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలేరులో బీఆర్ఎస్ కేడర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు వేసే ముందు పార్టీతో పాటు అభ్యర్థి గుణగణాలను చూడాలని సూచించారు. ఈ ఎన్నికల్లో ఒక వైపు బిట్స్ పిలానీలో చదువుకున్న అభ్యర్థి , మరో పార్టీ వైపు బ్లాక్ మెయిలర్, లాబీయింగ్ , పైశాచిక ఆనందం -మిగతా3లో



## మళ్లీ జడలు విప్పుతున్న కరోనా

- మళ్లీ మాస్క్ ధరించాలని సూచించిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ
- ఇటీవల వ్యర్థ నీటిలో కొవిడ్ ఆనవాళ్లను గుర్తింపు
- ఈ విషయాన్ని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నివేదిక వెల్లడి
- అమెరికా, సింగపూర్ సహా అనేక దేశాల్లో ఈ కొత్త వేరియంట్ కేసులు
- ప్రపంచవ్యాప్తంగా కరోనా జేఎన్.1, కేపీ.1, కేపీ.2 ఉప వేరియంట్లు విస్తరిస్తున్నట్లు నివేదిక
- జూన్ నెలాఖరు వరకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం కొనసాగించాలి

# ఈ ఏడాది సకాలంలోనే రుతుపవనాలు

- తెలంగాణలో మరో 3 రోజుల పాటు వర్షాలు
- ముందుగానే వర్ష సూచన.
- మే 31 నాటికి కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని అంచనా
- ఆ తర్వాత భారతదేశ భూభాగమంతా విస్తరిస్తాయని భారత వాతావరణశాఖ ప్రకటన విడుదల
- సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1న దేశంలోకి ప్రవేశిస్తాయి.
- తెలంగాణకు కూడా ముందుగానే రుతుపవనాలు వచ్చే అవకాశం



యాదాద్రి

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రైతులు , ప్రజలకు చల్లని కబురు చెప్పింది భారత వాతావరణ శాఖ. నైరుతి రుతుపవనాలు నాలుగు రోజులు అటూ ఇటూగా మే 31 నాటికి కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆ తర్వాత భారతదేశ భూభాగమంతా విస్తరిస్తాయని భారత వాతావరణశాఖ విడుదల చేసిన తాజా ప్రకటనలో వెల్లడించింది. అయితే, నైరుతి రుతుపవనాలు మే 31న కేరళను తాకడం ముందస్తు -మిగతా3లో

# మళ్లీ జడలు విప్పుతున్న కరోనా..



గత కొన్ని నెలలుగా కొవిడ్ శాంతించింది. తాజాగా మరోసారి విజృంభిస్తున్నది. రోజు రోజుకు కేసులు పెరుగుతున్నాయి. ఇటీవల వ్యర్థ నీటిలో కొవిడ్ ఆనవాళ్లను గుర్తించారు. ఈ విషయాన్ని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నివేదిక వెల్లడించింది. దీనికి 'ఫ్లిర్ట్' నామకరణం చేశారు. అమెరికా, సింగపూర్ సహా అనేక దేశాల్లో ఈ కొత్త వేరియంట్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. అయితే, వేగంగా పెరుగుతున్న ఇన్ఫెక్షన్ కారనంగా సింగపూర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రజలందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని మరోసారి విజ్ఞప్తి చేసింది. సీడీసీ నివేదిక ప్రకారం.. ఏప్రిల్ 14 నుంచి 27 వరకు అమెరికాలో దాదాపు 25శాతం కేసులకు కేపీ.2 సబ్ వేరియంట్ కారణంగా పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా కరోనా జేఎన్.1, కేపీ.1, కేపీ.2 ఉప వేరియంట్లు విస్తరిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ప్రస్తుతం సింగపూర్‌లో మూడింట రెండువంతుల కంటే ఎక్కువ కేసులు కేపీ.1, కేపీ.2 వేరియంట్ కేసులున్నాయి. ఈ వేరియంట్ ఒమిక్రాన్‌ను పోలి ఉంటుంది. వేగంగా సోకుతుందని పరిశోధకులు పేర్కొన్నారు. వ్యాక్సిన్ ద్వారా శరీరంలో ఉత్పత్తయిన యాంటీబాడీలను సైతం తప్పించుకుంటాయని తెలిపారు. సీడీసీ డేటా ప్రకారం ఫ్లిర్ట్ వేరియంట్.. కేజీ.1.1, కేపీ.2 వేరియంట్లు ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. రెండు వారాల వ్యవధిలో ఈ వైవిధ్యం కారణంగా సంక్రమణ కేసులలో చాలా వేగంగా పెరుగుదల ఉందని గుర్తించారు. అమెరికాలోని యేల్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డీన్ మేగాన్ ఎల్ మాట్లాడుతూ ఫ్లిర్ట్‌లో కొన్ని ఆందోళనకరమైన లక్షణాలు కనిపించాయని నివేదికలో పేర్కొన్నారు.

స్పైక్ ప్రోటీన్‌లో మార్పులు ఉన్నాయని.. ఇవి సులభంగా మానవ శరీరంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్‌కు కారణమవుతాయి. మీడియా నివేదికల ప్రకారం.. సింగపూర్‌లో కొవిడ్ కొత్త వేవ్ కనిపిస్తున్నది. మే 5 నుంచి 11 వరకే 25,900 కంటే ఎక్కువగానే కేసులు రికార్డయ్యాయి. ఈ క్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి ఒంగ్ యే కుంగ్ ప్రజలు మరోసారి మాస్కులు ధరించాలని విజ్ఞప్తి చేశారు. కొవిడ్ కొత్త దశ ప్రారంభంలో ఉన్నామని.. కేసులు నిరంతరం భారీగా పెరుగుతున్నాయని.. వచ్చే రెండు, నాలుగు వారాల్లో ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని మరోసారి మాస్కులు ధరించడం అలవాటు చేసుకోవాలని, తద్వారా వైరస్‌ని నియంత్రించవచ్చన్నారు.

జూన్ నెలాఖరు వరకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం కొనసాగించాల్సిన ఉందన్నారు. కొత్త వేరియంట్ ఫ్లిర్ట్ కేసులు భారత్‌లోనూ నమోదయ్యాయి. ఇప్పటి వరకు 250 వరకు కేసులు నమోదయ్యాయని తెలుస్తున్నది. మహారాష్ట్రలోనే కేపీ.2కి చెందిన 91 కేసులను గుర్తించారు. రాష్ట్రంలోని కరోనా కేసుల పెరుగుదలనుసూచిస్తుంది. మే 15 వరకు పూణేలో అత్యధికంగా 51 మందికి ఈ కొత్త వేరియంట్ సోకింది. 20 కేసులతో థానే రెండో స్థానంలో ఉంది. అమరావతి, ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాల్లో ఒక్కొక్కటి ఏడు కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా.. సీడీసీ నిపుణుల లెక్కల ప్రకారం.. సెప్టెంబర్ 2023 నుంచి కేవలం 22.6శాతం వరకు మాత్రమే వయోజనులు వ్యాక్సిన్ పొందారు.

## ఆప్ నేతల అరెస్ట్‌కు ఓటు ద్వారా సమాధానం



ఆప్ నేతల అరెస్ట్‌కు ఓటు ద్వారా ప్రజలు సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఆప్ నేతలే లక్ష్యంగా కాషాయ పాలకులు తమను వెంటాడుతున్నారని, తమ నేతలందరినీ జైళ్లలో పెడుతున్నారని అన్నారు. ఢిల్లీలో మీరు విజయం సాధించలేకపోతే ప్రతి ఒక్కరినీ జైళ్లో పెడతారా అని ఆయన కాషాయ పాలకులను ప్రశ్నించారు. తమ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులపైనా తాము ప్రజలను ఓట్లు అడుగుతున్నామని చెప్పారు. జూన్ 4న కాషాయ సర్కార్ ఏర్పాటు కాదని బీజేపీ పాలకులకు తెలుసునని అన్నారు. తమకు ప్రజల నుంచి ఈసారి భంగపాటు ఎదురవకతప్పదని కాషాయ పాలకులకు అర్ధమైందని చెప్పారు. ఇక ఆప్ నేతలను అరెస్ట్ చేసి జైలు పాలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ ఆపరేషన్ ఝాదూ చేపట్టాయని అంతకుముందు అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. స్వాతి మలివాల్‌పై దాడి కేసులో బిభవ్ కుమార్ అరెస్ట్‌కు నిరసనగా ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయానికి ఆప్ శ్రేణులు ప్రదర్శన నిర్వహించే క్రమంలో ఆప్ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాషాయ పార్టీకి దీటుగా ఆప్ ఎదగకుండా నిరోధించేందుకు బీజేపీ, ప్రధాని మోదీ కుట్రపూరితంగా ఆపరేషన్ ఝాదూను తెరపైకి తీసుకొచ్చాయని అన్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఆప్ బడా నేతలను అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారని, వారిని రాబోయే రోజుల్లో అరెస్ట్ చేయడంతో ఆప్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఎంపీగా గెలిస్తే సినిమాలకు దూరంగా ఉంటారా.. కంగనా రనౌత్ ఏం చెప్పారో తెలుసా..?



బాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నటి కంగనా రనౌత్ తాజాగా ఓ జాతీయ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధి.. 'ఈ ఎన్నికల్లో ఎంపీగా గెలిస్తే మీరు సినిమాలకు దూరంగా ఉంటారా..?' అని ప్రశ్నించారు. అందుకు అవుననే సమాధానం ఇచ్చారు. ఎంపీగా గెలిస్తే సినిమాలకు దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. 'బాలీవుడ్‌లో నేను విజయం సాధించా. నటిగా ఎన్నో అవార్డులు గెలుచుకున్నా. మండి ఎంపీగా గెలుపొందితే బాలీవుడ్‌కు వీడ్కోలు పలకాలనుకుంటున్నా. ఒక ఉత్తమ ఎంపీగా ప్రజలకు నావంతు సేవ చేసేందుకు కృషి చేస్తా. అదే నాకు గొప్ప అవార్డుగా భావిస్తా' అని కంగనా చెప్పారు. అయితే ఎంపీగా గెలిచినా సినీ ఇండస్ట్రీలో కొనసాగాలని నిర్మాతల నుంచి తనకు విజ్ఞప్తులు వస్తున్నాయని ఆమె తెలిపారు. 'మీరొక ప్రతిభావంతమైన నటి. సినిమాలకు దూరంగా ఉండొద్దు' అని చాలా మంది నిర్మాతలు, ప్రముఖ నటులు కోరుతున్నట్లు కంగనా రనౌత్ చెప్పారు. అంతకుముందు మరో వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కంగనా భిన్నంగా స్పందించారు. ఏమన్నారంటే.. 'ఎన్నికల ముందు నేను సంతకం చేసిన కొన్ని సినిమాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంతో వెంటనే బాలీవుడ్‌ను విడిచిపెట్టలేను' అని చెప్పారు. కంగనా రనౌత్ ఈ లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీపడ్డారు. ఎన్నికల కారణంగా ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'ఎమర్జెన్సీ వాయిదా పడింది. ఎన్నికల వేళ కంగనా బిజీగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్రబృందం ఇటీవల ప్రకటించింది. ఈ సినిమా కంగనా స్వీయ దర్శకత్వంలో రూపొందుతోంది.

# ఆ రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి 50 సార్లు ఆలోచిస్తారు..



**రాంచీ:** కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి 50 సార్లు ఆలోచిస్తారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన జార?ండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఆదివారం ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మావోయిస్ట్ భాష ఉపయోగించడం వల్ల ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆలోచిస్తారన్నారు. ఆ పార్టీ కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిస్తోందని, లోక్‌సభ స్థానాలను పూర్వీకుల ఆస్తులుగా పరిగణిస్తోందని ఆరోపించారు. రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలనే రాహుల్ గాంధీ నిర్ణయంపై మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్ 'షెహజాదా'(ప్రిన్స్ లేదా రాజకొడుకు) రాయ్‌బరేలీకి నియోజకవర్గానికి వెళ్లి ఇది తన అమ్మ పోటీ చేసే స్థానమని, తాను పోటీ చేస్తానని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను కాంగ్రెస్, జేఎంఎం తీసేయాలని చూస్తున్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. "కాంగ్రెస్, జేఎంఎంలకు అభివృద్ధి గురించి ఏమీ తెలియదు. వారి పని అబద్ధాలాడటం, బిగ్గరగా మాట్లాడటం, పేద ప్రజల సంపద దోచుకోవడం. కాంగ్రెస్ అవినీతికి కేరాఫ్. ఆ పార్టీ బొగ్గు, 2 జీ స్కామ్‌లతో దేశాన్ని దోచేసింది. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమికి తగిన బుద్ధి చెప్పాలి" అని మోదీ ఓటర్లను కోరారు.

**ఓ వర్గం ఓట్లు పొందేందుకు రామకృష్ణ మిషన్‌పై దాడి.. దీదీపై మోదీ విమర్శలు**

పురూలియా: ఓ వర్గం ఓట్లు పొందేందుకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హిందూ సంఘాలపై దాడి చేస్తోందని ప్రధాని మోదీ విమర్శించారు. పురూలియాలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి మోదీ మాట్లాడారు. రామకృష్ణ మిషన్, భారత్ సేవా శ్రమ సంఘాలపై దీదీ వ్యాఖ్యలను ఖండించారు. టీఎంసీ వీటికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఇస్కాన్, రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ సంఘానికి వ్యతిరేకంగా మాట్లాడి టీఎంసీ హద్దులు దాటిందని, వాటిని దీదీ బెదిరిస్తోందని ఇది కేవలం ఓ వర్గం ఓటు బ్యాంకును పొందేందుకే అని విమర్శించారు.

దీదీ ఏమన్నారంటే..


ఆరంబాగ్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని గోఘాట్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో దీదీ మాట్లాడుతూ.. "రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ సంఘానికి చెందిన కొందరు సన్యాసులు ఢిల్లీలో బీజేపీ నేతల ప్రభావంతో పనిచేస్తున్నారు. దేవాలయాలను చూసుకునే వారు గొప్ప ఆధ్యాత్మిక ఉద్యోగులు. కానీ కొందరి ప్రమేయంతో రాజకీయాలు చేస్తున్నారు" అని దీదీ ఆరోపించారు.

## ఆప్ నేతలను అకారణంగా అరెస్ట్ చేస్తున్నారు




ప్రధాని నరేంద్ర మోదీ ఆప్ నేతలందరినీ ఒకరి తర్వాత ఒకరిని జైలు పాలు చేస్తున్నారని ఆ పార్టీ నేత సందీప్ పాఠక్ ఆరోపించారు. ఎలాంటి కారణం లేకుండానే తమ పార్టీ నేతలను నిర్బంధంలోకి తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని తీరుతో విలువైన దేశ సమయం వృధా అవుతోందని, అందుకే తాము స్వచ్ఛందంగా అరెస్ట్ అవుతాయని ఆ మేరకు సమయం ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. ఈరోజు కాషాయ పాలకులు తమను అరెస్ట్ చేస్తే రేపు మరింత మంది అరెస్ట్ అయ్యేందుకు ముందుకొస్తారని ఆప్ నేత పేర్కొన్నారు. ఇక రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బిభవ్ కుమార్‌ను కాపాడేందుకు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ అన్నారు. కేజ్రీవాల్ కుయుక్తులు చూస్తుంటే ఆయన కనుసన్నల్లోనే ఈ ఘటన జరిగిందని వెల్లడవుతోందని ఆరోపించారు. కేజ్రీవాల్ తన నివాసంలో ఓ మహిళ పట్ల దురుసుగా వ్యవహరించిన వ్యక్తిని కాపాడేందుకు నిరసనలు చేపట్టడం శోచనీయమని అన్నారు. బిభవ్ కుమార్‌కు వ్యతిరేకంగా కేజ్రీవాల్ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటం లేదని మనోజ్ తివారీ ప్రశ్నించారు. అసలు అతడిని కాపాడేందుకు కేజ్రీవాల్ ఎందుకు ప్రయత్నిస్తున్నారని నిలదీశారు. బిభవ్ కుమార్ మహిళతో అభ్యంతరకరంగా ప్రవర్తించారని, సీసీటీవీ ఫుటేజ్‌ను ధ్వంసం చేశారని ఆప్ నేతలు ఇంతటి కుట్రకు తెగబడ్డారని బీజేపీ ఎంపీ ఆరోపించారు. మరోవైపు ఢిల్లీ పోలీసులు బీజేపీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నారని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సౌరబ్ భరద్వాజ్ ఆదివారం ఆరోపించారు.

## టేకాఫ్ అయిన కాసేపటికే ఇంజిన్‌లో మంటలు.. ఆ వెంటనే..



బెంగళూర్: ఎయిర్ ఇండియా విమానానికి ప్రమాదం తప్పింది. ఎయిర్ పోర్టు నుంచి టేకాఫ్ అయిన వెంటనే విమానం ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన పైలట్ వెంటనే విమానాన్ని ఎయిర్ పోర్టులో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే ప్రయాణికులను కిందకి దింపారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆ విమానంలో 179 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. బెంగళూర్ నుంచి కొచ్చి వెళుతుండగా విమానం ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. బెంగళూరులో గల కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి ఎయిర్ ఇండియా విమానం శనివారం రాత్రి 11.12 గంటలకు కొచ్చికి బయల్దేరింది. కాసేపటికే కుడి వైపు ఉన్న ఇంజిన్‌లో మంటలను సిబ్బంది గుర్తించారు. వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు సమాచారం ఇచ్చారు. ఏటీసీ అగ్నిమాపక సిబ్బందిని అలర్ట్ చేశారు. విమానం ల్యాండ్ అయ్యే సమయానికి రన్ వే వద్ద సిబ్బంది ఉన్నారు. విమానం దిగిన వెంటనే ప్రయాణికులను సురక్షితంగా కిందకి దింపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని ఎయిర్ ఇండియా ప్రకటించింది. ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చడం కోసం ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేస్తామని వివరించింది.

# వారు అమ్మేది చెప్పులే.. కానీ, ఆ గది నిండా నోట్ల కట్టలే..!



**లక్నో :** వారు అమ్మేది చెప్పులు.. కానీ, వారి వద్ద ఉన్న సంపద కోట్లు.. అవును, వారి వద్ద ఉన్న నోట్ల కట్టలు చూసి ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు ఖంగుతిన్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా రూ. 40 కోట్ల నగదు పట్టుబడింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ముగ్గురు చెప్పుల వ్యాపారుల ఇళ్లపై ఆదాయపు పన్ను శాఖ దాడులు చేసింది. ఈ క్రమంలో వారి వద్ద లెక్కల్లో చూపని భారీగా డబ్బు బయటపడింది. ముగ్గురు చెప్పుల వ్యాపారుల వద్ద ఇప్పటివరకు రూ.40 కోట్ల నగదు దొరికినట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇంకా లెక్కించని నగదు ఉందని.. వాటిని కూడా లెక్కించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. వారి వద్ద స్వాధీనం చేసుకున్న డబ్బు ఒక గది నిండా ఉందన్నారు. రూ.500 బండిళ్లను లెక్కించే బాధ్యతను బ్యాంకు అధికారులు, ఉద్యోగులకు అప్పగించారు. 'చాలా నోట్లు ఉన్నాయి, గది మొత్తం 500-500 నోట్ల కట్టలతో నిండిపోయింది. ఇప్పటి వరకు రూ.40 కోట్లు లెక్కతేల్చగా ఇంకా లెక్కలు తేలాల్సిన ఉననాయి. మిగిలిన మొత్తం లెక్కింపు జరుగుతోంది.' అని అధికారులు తెలిపారు. కాగా, పట్టుబడిన నగదును లెక్కించడానికి అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ చెప్పుల వ్యాపారులు ఆదాయపు పన్ను చెల్లించడం లేదనే సమాచారం అందుకున్న ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు.. మధ్యాహ్నం సమయంలో వారి ఇళ్లపై దాడులు చేశారు. భారీ ఎత్తున నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు.. కీలక పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

**కాన్పూర్‌లోనూ దాడులు..**

అంతకుముందు యూపీలోని కాన్పూర్‌లో ఆదాయపు పన్ను శాఖ భారీ దాడులు నిర్వహించింది. బన్షీధర్ టొబాకో కంపెనీపై శాఖ దాడులు చేసింది. కాన్పూర్‌తో పాటు, ముంబై, ఢిల్లీ, గుజరాత్‌లలో ఉన్న ఈ కంపెనీ బ్రాంచ్‌లలోనూ తనిఖీలు చేసింది. ఏకకాలంలో దాదాపు 20 చోట్ల దాడులు నిర్వహించారు. ఈ పొగాకు కంపెనీ తమ టర్నోవర్‌ను దాదాపు రూ.20 నుంచి 25 కోట్లుగా చూపించగా, విచారణలో కంపెనీ టర్నోవర్ రూ.100-150 కోట్లుగా తేలింది. 2024 ఫిబ్రవరి 29న ఐటీ రైడ్స్ నిర్వహించింది. ఈ కంపెనీ యజమానికి ఢిల్లీలో ఇంద్రభవనం వంటి ఇల్లు ఉంది. అక్కడ రూ.60 కోట్లకు పైగా విలువైన కార్లతో పాటు.. 16 కోట్ల విలువైన రోల్స్ రాయిస్ ఫాంటమ్‌ను కూడా స్వాధీనం చేసుకున్న ఐటీ అధికారులు.

# ఇవాళ తెలంగాణ ఆగమైంది

-మొదటి పేజీ తరువాయి

పొందే అభ్యర్థి ఉన్నారని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో అభ్యర్థులను చూసి ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయోధ్య గుడి కట్టారని చెబుతూ.. బీజేపీ అభ్యర్థి ఓట్లు అడుగుతున్నారని.. తాము యాదాద్రి గుడి కట్టామని... గుడి పేరుతో తాము ఇంతవరకు ఓట్లు అడగలేదని చెప్పారు. తాము ప్రాజెక్టులు కట్టామని.. అవి కూడా దేవుళ్ల పేరు మీద కట్టామని అయినా తాము దేవుడి పేరుతో ఏ ఎన్నికల్లోనూ ఓట్లు అడగట్లేదని స్పష్టం చేశారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాక ముందు ఒక మెడికల్ కళాశాల కూడా లేదన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు మెడికల్ కళాశాలను ప్రకటించారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటమికి రెండు కారణాలు ఉన్నాయని.. ఒకటి చేసిన పనిని చెప్పుకోలేదని.. రెండోది కొన్నివర్గాలను దూరం చేసుకోవడంతోనే ఓడిపోయామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు నాట్లు వేస్తున్నప్పుడు రైతు బంధు వచ్చింది.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఓట్లు వేస్తున్నప్పుడు మాత్రమే రైతు బంధు వేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.



### ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించండి

'నల్లగొండ-వరంగల్-ఖమ్మం' గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో గెలుపు మనదేనని, ఓటర్లు ఆలోచించి ఓటయ్యాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్నిసార్లూ గులాబీ పార్టీయే గెలుస్తూ వస్తున్నదని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి స్వయంకృషితో పైకి వచ్చాడని, హైలీ ఎడ్యుకేటెడ్ వ్యక్తి అని చెప్పారు. ప్రధాని మోదీ అన్ని వర్గాలను మోసం చేస్తూ వస్తున్నడని, విభజన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు.

యాదాద్రి ఆలయాన్ని కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారని కేటీఆర్ చెప్పారు. బీజేపీ వాళ్ళు గుడికట్టి ఓట్లడుగుతున్నారని, అలాగైతే మనం కూడా యాదాద్రి ఆలయం కట్టామని అన్నారు. కాళేశ్వరం లాంటి ఆధునిక ఆలయాన్ని కూడా కేసీఆర్ కట్టారని, ఆయన పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్ 1 స్థానంలో నిలిచిందని చెప్పారు. ఉమ్మడి నల్లగొండలో మూడు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామని, యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మించామని గుర్తుచేశారు. చేసిన పని సరిగా చెప్పుకోలేక పోయామని, అందుకే ఓటమి పాలయ్యామని అన్నారు. మా పాలనలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని కేటీఆర్ తెలిపారు. రుణమాఫీపై కాంగ్రెస్ పూటకో మాట మారుస్తున్నదని విమర్శించారు. ఇవాళ తెలంగాణ ఆగమైందని, కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ఇచ్చి అన్నింటిని మర్చిపోయిందని అన్నారు. ప్రశ్నించే గొంతుక, ధిక్కార స్వరం అయిన రాకేష్ రెడ్డిని గెలిపించాలని ఈ సందర్భంగా కేటీఆర్ కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ 30 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తే.. వాటి జాయినియంగ్ లెటర్లు పంచుతూ రేవంత్ రెడ్డి సొంత డబ్బా కొట్టుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డివి పచ్చి అబద్ధాలని మండిపడ్డారు. మన అభ్యర్థి రాకేష్ రెడ్డి విద్యావంతుడని, ఆయన ప్రత్యర్థి పచ్చి బ్లాక్ మైలర్ అని, సొల్లు కబుర్లు చెప్పే మోసగాడని అన్నారు.

# గ్రీన్ సిగ్నల్... కానీ!

-మొదటి పేజీ తరువాయి

సమావేశానికి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. అయితే షరతులు వర్తిస్తాయని తెలిపింది. జూన్ 4వ తేదీలోపు చేయాల్సిన అత్యవసర విషయాలపైనే చర్చించాలని షరతు విధించింది. రైతు రుణమాఫీ, ఉమ్మడి రాజధాని అంశాలపై చర్చించకూడదని స్పష్టం చేసింది. అదేవిధంగా ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు భేటీలో పాల్గొనకూడదని తేల్చిచెప్పింది. శనివారం జరగాల్సిన రాష్ట్ర కేబినెట్ భేటీ వాయిదాపడిన విషయం తెలిసిందే.



శనివారం నిర్వహించాలనుకున్నప్పటికీ ఎన్నికల కమిషన్ అనుమతి రానందున క్యాబినెట్ భేటీని వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించుకునేందుకు అనుమతించాలని ఎన్నికల సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. శనివారం సాయంత్రం 7 గంటల వరకు ఈసీ అనుమతి కోసం వేచి చూశామని, అనుమతి రాకపోవడంతో సమావేశం కాలేకపోయినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈసీ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నామని, సోమవారం నాటికి అనుమతి రాకపోతే ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవాలని యోచిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

ఒకవేళ అనుమతి వచ్చి ఉంటే, రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, వానకాలం పంటల ప్రణాళిక, రైతులకు సంబంధించిన పలు కీలకమైన అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని ఎజెండా సిద్ధం చేసినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈసీ అనుమతి లేకపోవడంతో రైతుల సంక్షేమం, అత్యవసరమైన అంశాలపై చర్చించలేకపోయామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణతోపాటు రాష్ట్ర విభజన జరిగి పదేండ్లు పూర్తి కావడంతో ఇప్పటివరకు రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలను క్యాబినెట్ భేటీలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. క్యాబినెట్ భేటీ వాయిదా పడటంతో ఇవేవీ చర్చించలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈసీ నుంచి అనుమతి ఎప్పుడు వస్తే.. అప్పుడే క్యాబినెట్ భేటీ జరపాలని సీఎం నిర్ణయించారు.

తెలంగాణ రాష్ట్రంలో మే 13వ తేదీన లోక్ సభ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మంత్రివర్గ సమావేశం నిర్వహించేందుకు అనుమతి గురించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ దృష్టికి తెలంగాణ ప్రభుత్వం తీసుకెళ్లింది. ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో వికాస్ రాజ్ చర్చించారు. దీంతో అత్యవసర పనుల విషయంపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. ఈసీ ప్రకటనతో తెలంగాణ మంత్రివర్గ సమావేశం త్వరలో జరిగే అవకాశం ఉంది.

# ఈ ఏడాది సకాలంలోనే రుతుపవనాలు

-మొదటి పేజీ తరువాయి

కాదని, సాధారణ తేదీకి సమీపంగా ఉందని ఐఎండీ వెల్లడించింది. కాగా వ్యవసాయాధారిత భారత ఆర్థిక వ్యవస్థకు నైరుతి రుతుపవనాలు చాలా ముఖ్యమైనవి. నైరుతి రుతు పవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా నాలుగు నెలలపాటు వర్షాలు కురుస్తాయి. కాగా ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవనుందని గత నెలలో ఐఎండీ అంచనా వేసింది.



సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1న దేశంలోకి ప్రవేశిస్తాయి. కేరళను తాకి.. ఆ తర్వాత దేశమంతా వ్యాపిస్తాయి. రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరించాలంటే దాదాపుగా నెల సమయం పడుతుంది. అంటే.. జూలై 15 నాటికి దేశం మొత్తం రుతుపవనాలు ఆవరిస్తాయి. ఐఎండీ తాజా అంచనా ప్రకారం మే 31 నాటికి కేరళలో రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఈసారి ఇండియన్ ఓషియన్ డైపోల్ - ఐవోడీ ప్రస్తుతం 'తటస్థంగా' ఉంది. ఆగస్టు నాటికి సానుకూలంగా మారే అవకాశం ఉంది. ఈ నెలాఖరుకల్లా కేరళను ఋతుపవనాలు తాకితే.. మరో వారం పది రోజుల్లో.. అంటే జూన్ మొదటి వారంలోనే రుతుపవనాలు ఏపీని పలకరిస్తాయి. ఆ తర్వాత క్రమంగా విస్తరించి దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. తాజా అంచనాల బట్టి చూస్తే.. తెలంగాణకు కూడా ముందుగానే రుతుపవనాలు వచ్చే అవకాశం ఉంది.

### తెలంగాణలో మరో 3 రోజుల పాటు వర్షాలు

సాధారణంగా మే నెలలో ఎండలు దంచికొడతాయి. కానీ కానీ ప్రజంట్ మే నెలలో వర్షాలు దుమ్మురేపుతున్నాయి. తాజాగా తెలంగాణకు రెయిన్ అలర్ట్ వచ్చేసింది. రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదివారం కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది. అలానే గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు కూడా వీస్తాయని వెల్లడించింది. భారీ వర్షాల నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్గొండ, రంగారెడ్డి, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వనపర్తి, జనగామ, జోగులాంబ గద్వాల, యాదాద్రి భువనగిరి, హనుమకొండ, వరంగల్, నారాయణపేట, పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

నైరుతి రుతుపవనాలు ఆదివారం మాల్దీవులులో కొంత వరకు, కోమరిన్ ప్రాంతంలో కొంతమేర, దక్షిణ బంగాళాఖాతం, నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాల వరకు విస్తరించాయని వాతావరణ కేంద్రం సంచాలకులు తెలిపారు. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో కొనసాగిన ఆవర్తనం ఆదివారం బలహీన పడిందని తెలిపారు.

హైదరాబాద్ నగరంలోనూ భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉదయం కాస్త ఎండకాసినా.. సాయంత్రానికి వర్షాలు పడతాయన్నారు. వారు చెప్పినట్లుగానే నగరాన్ని నల్లటి మేఘాలు కమ్మేశాయి. మరో కూల్ న్యూస్ ఏంటంటే.. నైరుతి రుతుపవనాలు మరో 36 గంటల్లో.. అండమాన్ నికోబార్ దీవులు, ఆగ్నేయ బంగాళాఖాతాన్ని చేరతాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

# బెర్తుల కోసం లాబీయింగ్

-మొదటి పేజీ తరువాయి

సంకేతాలు లేకపోలేదు. ఈసారి ఏ జిల్లాకు ప్రాధాన్యత ఇస్తారనేది తెలంగాణ కాంగ్రెస్‌లో హాట్ హాట్‌గా చర్చ జరుగుతోంది. రాజ్యాంగం పద్ధతి ప్రకారం సీఎంతో కలిసి 18 మందికి మించరాదు. ప్రస్తుతం ముఖ్యమంత్రితో కలిసి 12 మంది మంత్రులున్నారు. మరో ఆరుగురు ఛాన్స్ ఉందన్నమాట. హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఛాన్స్ ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీసీ, ముదిరాజ్, మైనార్టీ వర్గాలతో కలిసి మొత్తం ఆరుగురికి అవకాశం ఇవ్వడం ఖాయం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా పదవులు ఉంటాయని గతంలో కాంగ్రెస్ ముఖ్యనేతలు చెప్పుకొచ్చారు. సరైన పనితీరు కనబరచని మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. రేవంత్ కేబినెట్‌లో ఖమ్మం నుంచి ముగ్గురు మంత్రులున్నారు. నల్గొండ, వరంగల్, కరీంనగర్ నుంచి ఇద్దరేసి మంత్రులున్నారు. ఖమ్మం నుంచి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉన్నారు. నల్గొండ నుంచి ఉత్తమ్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్క, కరీంనగర్ నుంచి పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఉన్నారు. ఇక హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేలు ఎవరు లేరు. బీఆర్ఎస్ నుంచి ఎవరైనా వస్తే వారికి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇక రంగారెడ్డి జిల్లా విషయానికొస్తే పరిగి ఎమ్మెల్యే రామ్‌మోహన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ రేసులో ఉన్నారు. ఈ వ్యవహారమంతా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే జరగనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు జులైలో జరగాలి. కానీ ఆ సమయంలో జరిగే ఛాన్స్ లేదు. ఎందుకంటే రైతుబంధు పథకానికి నిధులు ఆగస్టులో వేస్తామని రేవంత్ సర్కార్ చెప్పింది. ఆ లెక్కన చూస్తే సెప్టెంబరులో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగడం ఖాయమని పలువురు నేతలు చెబుతున్నమాట.

## ధరణిలో.. అన్ని సమస్యలే




-మొదటి పేజీ తరువాయి

స్పెషల్ ఫోకస్ పెట్టింది. గత ప్రభుత్వం హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో సమస్యలు ఉన్నాయని గుర్తించిన రేవంత్ ప్రభుత్వం.. వాటి పరిష్కారంపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే.. ధరణి సమస్యల పరిష్కారానికి కమిటీ వేయగా.. ప్రభుత్వ ఆదేశాలతో దూకుడుగా వ్యవహరిస్తోంది. ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వరుసగా భేటీలు నిర్వహిస్తోంది. తాజాగా.. సెక్రటేరియట్‌లో ధరణి కమిటీ మరోసారి సమావేశం అయింది. ఈ సమావేశంలో చైర్మన్ కోదండరెడ్డి, కమిటీ మెంబర్లు, సీసీఎల్ఏ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ధరణి సమస్యల పరిష్కారానికి నిర్వహించిన సమావేశాలతోపాటు.. స్పెషల్ డ్రైవ్‌లో వచ్చిన అప్లికేషన్లపై సమీక్షించింది. ధరణి డ్రైవ్‌లో పరిష్కరించిన దరఖాస్తులపైనా చర్చించింది. తెలంగాణలోని భూ సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్ ప్రభుత్వానికి కీలక సూచనలు ప్రతిపాదించింది. జూన్ 4వ తేదీలోగా రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న లక్ష ఫిర్యాదులను పరిష్కరించాలని నిర్ణయించింది. 33 జిల్లాల్లో ధరణి సమస్యలపై రెండు లక్షల 45 వేల అప్లికేషన్లు పెండింగ్ ఉండగా.. ఇప్పటికే లక్షన్నర కంప్లైంట్‌లను పరిష్కరించినట్లు ధరణి కమిటీ పేర్కొంది. ధరణిలో మొత్తం 119 తప్పుల్లో స్పెషల్ డ్రైవ్ తర్వాత 76 తప్పులను పరిష్కరించాల్సి ఉందని కమిటీ గుర్తించింది. అలాగే.. నిషేధిత జాబితాలో ఉన్న భూముల ఆక్రమణలపైనా ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఇక.. పూర్తిస్థాయి రివ్యూల తర్వాత ధరణి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది కమిటీ. మొత్తంగా.. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ధరణి పోర్టల్ ప్రక్షాళనే లక్ష్యంగా కమిటీ వరుసగా సమీక్షలు చేస్తోంది.

## శ్రీశైలంలో భారీగా ట్రాఫిక్ జామ్..
## ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు



ద్వాదశ జ్యోతిర్లంగ క్షేత్రమైన శ్రీశైలం ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ భారీగా పెరిగింది. విద్యార్థులకు వేసవి సెలవులు కావడం.. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు ఆదివారం సెలవు దినం కావడంతో తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందిన భక్తులు శ్రీమల్లికార్జున స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సాధారణ భక్తులు స్వామివారి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో టోల్‌గేట్ మలుపు వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పెద్ద ఎత్తున వచ్చిన వాహనాలను శివపార్వతుల విగ్రహాల వద్ద నిలిపి వేయడంతో దర్శనం అనంతరం తిరిగి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రద్దీ రోజుల్లో ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దడంతోపాటు, ఇలాంటి సమస్యలు మళ్లీమళ్లీ తలెత్తకుండా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## సంగారెడ్డి జిల్లాలో భారీగా రేషన్ బియ్యం పట్టివేత




**హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లిలో సివిల్ సప్లై అధికారులు భారీగా రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యా న్ని పక్కదారి పట్టిస్తున్నారనే సమాచారం మేరకు చిరాగ్‌లో పల్లిల్లో దాడి లారీలో తరలిస్తున్న 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆ నియోజకవర్గంలో త్రిముఖ పోరు తప్పదా..

# ఫలితాల్లో పైచేయి ఎవరిది

పెద్దపల్లి పార్లమెంటు పోలింగ్?పై ఆసక్తి నెలకొంది. పోలింగ్?కి రెండు రోజుల ముందు కాంగ్రెస్ హవా స్పష్టంగా కనబడింది. కనీసం రెండు లక్షలపైగా మెజారిటితో విజయం సాధిస్తామనే ధీమాతో పార్టీశ్రేణులు ఉన్నాయి. కానీ పోలింగ్ రోజు అందుకు భిన్నమైన ఓటింగ్ సరళీ కనబడింది. పైకి కాంగ్రెస్ గెలుస్తామని ధీమాతో ఉన్నా లోలోపల ఎదో గుబులు కనబడుతుంది. ఇక్కడ త్రిముఖ పోరు ఉండడంతో పోరు కూడ రసవత్తరంగా మారింది. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో 67.8 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. గత ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు జరిగిన పోలింగ్ శాతం కుడా దాదాపుగా సమానంగా ఉంది. ఈ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉంటే గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది. ఇక్కడ కాంగ్రెస్?కి పట్టు ఉన్న నేపథ్యంలో వివేక్ తనయుడు వంశీకృష్ణ బరిలోకి దిగారు. బీఅర్ఎస్ నుండి కొప్పుల ఈశ్వర్, బిజేపి నుండి గోమాస శ్రీనివాస్ పోటీ చేసారు. నామినేషన్ వరకు బిజేపిలో అంతర్గత విభేధాలతో క్యాడర్ సరిగా పనిచేయలేక పోయింది. బీఅర్ఎస్ ముఖ్య నేతలు కూడ కాంగ్రెస్ కండువా కప్పుకున్న కారణంగా అనుకున్న స్థాయిలో ప్రచారాన్ని ముమ్మరంగా చేయలేకపోయింది. ఈ క్రమంలో కాంగ్రెస్ గెలుపు నల్లేరుపై నడకగానే భావించారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలో ఇక్కడ నుండే అత్యధిక మెజారిటీ వస్తుందని ధీమాతో ఉన్నారు కాంగ్రెస్ నేతలు. కానీ పోలింగ్ రోజు కొన్ని భిన్నమైన పరిస్థితులు కనబడ్డాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో బీజేపీ పుంజుకుంది. చివరి నిమిషంలో బీఆర్ఎస్ శ్రేణులు బిజేపికి మద్దతుగా ఓటు వేశారు. ఇక్కడ పోలింగ్ సరళి చూస్తే ఏకపక్షంగా కాంగ్రెస్?కు ఓటు పడలేదని రాజకీయ



పరిశీలకులు భావిస్తున్నారు. బీఅర్ఎస్ కూడా కార్మిక క్షేత్రాలు అయిన రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లిలలో కాస్త పుంజుకున్నట్లు కనిపిస్తోంది. అర్బన్ ఓటర్లు బిజేపికి ఎక్కువగా ఓట్లు వేసినట్లు పోలింగ్ సరళి బట్టి తెలుస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో మాత్రం కాంగ్రెస్?ని ఆదరించారు. ఇక్కడ ఓట్లు చీలిపోవడంతో కాంగ్రెస్ దిగులు చెందుతుంది. అయితే ఇది ప్రచారం మాత్రమే ఖచ్చితంగా లక్ష యాభై వేలకి పైగానే మెజారిటీతో గెలుస్తామని ధీమాని వ్యక్తం చేస్తున్నారు కాంగ్రెస్ నాయకులు. మొదడి నుండి అనుకున్న స్థాయిలో బిజేపి ప్రచారం చేయలేక పోయింది. చాల చోట్ల అభ్యర్థి ప్రచారం చేయలేదు. క్యాడర్ కూడ ఎక్కడా ఉత్సాహంగా పనిచేసిన పరిస్థితి కనబడలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటిగా ప్రచారం నిర్వహించింది. కానీ పోలింగ్ రోజు మాత్రం ఇక్కడ మోడీ మేనియా స్పష్టంగా కనబడింది. మూడు పార్టీలు కుడా పోటాపోటీగా ఓట్లు రావడంతో గెలుపు గురించి పూర్తి భరోసాగా చెప్పలేక పోతున్నారు. అధికార పార్టీ మాత్రం ప్రతిపక్షాలకు ఓట్లు పడినా తమ గెలుపుని ఎవరు ఆపలేరని ధీమాతో ఉంది. మొత్తానికి పెద్దపల్లి పార్లమెంటు ఫలితాలు ఉత్కంఠగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# పైసల కోసం ప్రియురాలి దిమ్మతిరిగే స్కెచ్..

# లక్షల సొమ్ము కాజేసి విదేశాలకు పరార్!

**తిమ్మాపూర్ :** ప్రేమ పేరిట ఓ యువతి ఆడిన నాటకానికి ఆ ప్రేమికుడి గుండె బద్దలైంది. మాయ మాటలు చెప్పి లక్షల రూపాయలు దండుకుంది. అనంతరం ఆ డబ్బులతో బంగారు ఆభరణాలు కొనుక్కొని, వాటితో విదేశాలకు ఉడాయించింది. అంతటితో ఆగకుండా ఆ యువకుడికి ఉన్న స్థిరాస్తిని కూడా రాసివ్వాలని, లేదంటే పెళ్లి చేసుకోనంటూ పదేపదే ఫోన్ చేసి వేధించసాగింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి తండ్రి ఫిర్యాదు చేయడంతో శనివారం ఆలస్యంగా ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. తిమ్మాపూర్‌కు చెందిన మాదన నాగరాజు డీ ఫార్మసీ చదువుతూ.. గతేడాది కోయంబత్తూర్‌లో ఇషా ఫౌండేషన్‌లో పనిచేయసాగాడు. అక్కడే వైజాగ్‌కు చెందిన ప్రియాంక అనే యువతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త అనతి కాలంలోనే ప్రేమగా మారింది. అనంతరం కొన్నాళ్లకు ఆస్ట్రేలియాకు వెళ్లింది. తనకు డబ్బులు పంపిస్తే ఇండియాకు వచ్చి మనువాడతానని చెప్పింది. దాంతో నాగరాజు ఆమె చెప్పిన విధంగా ఫోన్ పే ద్వారా రూ.లక్ష పంపాడు. అనంతరం ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ప్రియాంక నేరుగా తిమ్మాపూర్‌లోని నాగరాజు ఇంటికి



వచ్చింది. పెళ్లికి ముందే యువతి ఇంటికి రావడాన్ని నాగరాజు కుటుంబసభ్యులు తప్పుబట్టారు. దీంతో ఇద్దరూ తిమ్మాపూర్‌లోనే ఓ అద్దె ఇంట్లో నెలరోజుల పాటు కలిసి ఉన్నారు. ఈ క్రమంలో నాగరాజు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తనకున్న భాగస్వామ్యాన్ని వదులుకుని రూ.16 లక్షలు తీసుకుని.. ఆ మొత్తాన్ని ప్రియాంక తన సోదరి అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. ఆ తర్వాత వైజాగ్ వెళ్లి, ఆ డబ్బుతో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి, అక్కడే మూడు నెలలపాటు ఇద్దరూ కలిసి ఉన్నారు. తర్వాత ఆమె బంగారు నగలు తీసుకుని ఆస్ట్రేలియాకు ఉడాయించింది. కొన్నాళ్లకు నాగరాజుకు యువతి ఫోన్ చేసి, తనను పెళ్లి చేసుకోవాలంటే అతని వాటా కింద వచ్చే రెండెకరాల భూమిని తన పేరుమీద రాసివ్వాలని చెప్పింది. అలా పలుమార్లు ఫోన్లు చేసి వేధించసాగింది. దీంతో మనస్తాపం చెందిన నాగరాజు ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. నాగరాజు తండ్రి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రియాంకతోపాటు ఆమె సోదరి, శ్రీనివాస్‌రావు అనే మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భూకబ్జాపై మల్లారెడ్డి హాట్ కామెంట్స్..

# కాంగ్రెస్ ఎమ్మెల్యేకు సవాల్..

**హైదరాబాద్ :** సుచిత్రలో నెలకొన్న భూవివాదంపై మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. భూమి విషయంలో తన వద్ద ఉన్నవి తప్పుడు డాక్యుమెంట్స్ అని కాంగ్రెస్ నేతలు ఆరోపించడంపై తీవ్రంగా స్పందించారు. తన డాక్యుమెంట్స్ ఫేక్ అని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు తాను సిద్ధం అని ప్రకటించారు మల్లారెడ్డి. తనపై ఆరోపణలు చేసిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ సిద్ధమా? అని ప్రశ్నించారు. భూమి విషయంలో తన తప్పు ఉందని నిరూపిస్తే అన్నీ వదిలేసి పోతానని అన్నారు. ఈ భూమి విషయంలో వారివే ఫోర్జరీ డాక్యుమెంట్స్ అని ఆరోపించారు మల్లారెడ్డి. ఇదే విషయమై ఆదివారం నాడు మీడియాతో మాట్లాడిన మల్లారెడ్డి.. సర్వే ఇప్పుడే పూర్తయ్యింది కదా.. రిపోర్ట్ వచ్చే వరకు అందరూ వెయిట్ చేయాలన్నారు. సోమవారం నాడు సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి, కలెక్టర్లను కలుస్తానని.. తన వద్దనున్న ఒరిజినల్ డాక్యుమెంట్స్‌ని వారికి చూపిస్తానని మల్లారెడ్డి చెప్పారు.

**కొనసాగుతున్న దర్యాప్తు..**

మల్లారెడ్డి భూ వివాదంపై దర్యాప్తు కొనసాగుతోంది. సుచిత్రలో మల్లారెడ్డి భూవివాదంపై రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఇరువురి సమక్షంలో పూర్తిగా హద్దులను సర్వే చేశారు అధికారులు. సర్వే నెంబర్ 82, 83ను సర్వే విస్తీర్ణాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ సర్వే రిపోర్ట్‌ను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, ల్యాండ్ తమదేనంటూ ఇరు వర్గాల వ్యక్తులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో.. రెవెన్యూ అధికారుల రిపోర్ట్ కీలకంగా మారింది.

**మల్లారెడ్డిపై ధర్మపురి కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మణ్ ఫైర్..**



సుచిత్రలోని భూ వివాదంలో ఎమ్మెల్యే లక్ష్మణ్ పేరును మల్లారెడ్డి ప్రస్తావించారు. దీంతో ఇవాళ లక్ష్మణ్ స్పందించారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. శనివారం జరిగిన వివాదంలో తన పేరును ప్రస్తావించడంతోనే తాను మీడియా ముందుకు వచ్చానని క్లారిటీ ఇచ్చారు. మల్లారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని దౌర్జన్యంగా భూమిని అక్రమించారని ఆరోపించారు. తాము కొన్న భూమిని ఫేక్ డాక్యుమెంట్లు అని మల్లారెడ్డి చెప్తున్నారని అన్నారు. కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్‌ను వెకేట్ చేయించుకోలేదన్నారు. గతంలో తాము పోలీసులకు, మున్సిపల్ కమీషనర్‌కు పిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని లక్ష్మణ్ ఆరోపించారు. సర్వే అనంతరం చట్టప్రకారం రెవెన్యూ అధికారుల నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు లక్ష్మణ్. తమ ప్రభుత్వంపై బురద జల్లడం మంచి పద్దతికాదని మల్లారెడ్డికి హితవు చెప్పారు లక్ష్మణ్.

**సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి..**

మల్లారెడ్డి భూ కబ్జాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరతామని ఎమ్మెల్యే లక్ష్మణ్ తెలిపారు. గత ప్రభుత్వం మల్లారెడ్డి గుండాయిజం చేసారని ఆరోపించారు. ప్రస్తుతం వివాదం నడుస్తున్న భూమిలో తనకు కేవలం 600 గజాల స్థలం మాత్రమే ఉందన్నారు. మల్లారెడ్డి నోరు పెద్దదిగా చేస్తే ఎవరు భయపడరన్నారు. ల్యాండ్ లోకి పోవద్దని ఇంజక్షన్ ఆర్డర్‌లో ఉన్నా.. మల్లారెడ్డి లెక్క చేయలేదని, ల్యాండ్ లోకి వెళ్ళారని ఆరోపించారు. సర్వే ప్రకారం తమ ల్యాండ్ తమకు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. 4000 గజాలు తప్ప మిగతా ల్యాండ్‌తో తమకు అనవసరం లేదని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో మల్లారెడ్డి కావాలనే కాంగ్రెస్ పార్టీ మీద బురద చల్లుతున్నారని ఆరోపించారు. 2015లో ఈ ల్యాండ్ సర్వే అవసరం లేదని మల్లారెడ్డి అడ్డుకున్నారని లక్ష్మణ్ ఆరోపించారు. తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు కరెక్ట్ కాకపోతే ఈ ల్యాండ్ వదిలిపెడతా మన్నారు. ల్యాండ్ విషయంలో కోర్టు నోటీసులు జారీ చేసినా మల్లారెడ్డి ఎందుకు స్పందించడం లేదని లక్ష్మణ్ ప్రశ్నించారు. త్వరలో మల్లారెడ్డి దొంగతనం, ఆయన అసలు బండారం బయటపడుతుందన్నారు. ఈ ప్రభుత్వం చట్టం ప్రకారం పోతుందన్నారు. మల్లారెడ్డి ఇంకా మంత్రి పదవిలో ఉన్నట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తాము చట్టాన్ని గౌరవిస్తామని.. మల్లారెడ్డి లాగా చట్టాన్ని వ్యతిరేకించమని ఎమ్మెల్యే లక్ష్మణ్ వ్యాఖ్యానించారు.

## నూతనంగా ప్రారంభమైన స్కూల్



**వాస్తవ నేస్తం,కోదాడ:** పట్టణంలోని పబ్లిక్ క్లబ్ దగ్గర పాత వివేకానంద పాఠశాల భవనంలో నూతనంగా హెూలీ ఫ్యామిలీ స్కూల్ ను ఘనంగా ప్రారంభించడం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ ఆర్. సువర్ణ బాబు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కౌన్సిలర్ నిరంజన్ రెడ్డి , ప్రిన్సిపాల్ డి సైదులు,డైరెక్టర్స్ చింతల కొండలు, గుజ్జర్లపూడి నందకిషోర్ , కురుకంటి శేఖర్ మరియు మోర్తాల శిరీష ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందం పాల్గొని పాఠశాలను ప్రారంభించడం జరిగింది. కరస్పాండెంట్, ప్రిన్సిపల్, డైరెక్టర్స్ మాట్లాడుతూ హెూలీ ఫ్యామిలీ స్కూల్ ను ప్రారంభించడానికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ,పట్టణ ప్రముఖులకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తులో మా పాఠశాల ఎంతో మంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా అన్ని రంగాల్లో రాణించడానికి ఉపయోగపడుతుందని తెలియజేయడం జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'అయ్యో రామ - ఏమిటి ఈ ఖర్మ'..

## పర్ణశాల ఆలయంలో భక్తుల భావన..



దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన పుణ్య క్షేత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం. దీనికి అనుబంధ ఆలయమైన పర్ణశాలలో భక్తులను ఆకట్టుకునే చారిత్రాత్మక ఘట్టాలు ఎన్నో ఉన్నాయి. సీతమ్మ వనవాసం చేసిన చారిత్రాత్మక ఆనవాళ్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పర్ణశాల కుటీరం ఉంది. సీతమ్మ నారచీరలను తిలకించేందుకు నిత్యం వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇక్కడకు దర్శనానికి వచ్చే భక్తులను నిలువు దోపిడి చేస్తూ కొత్తపుంతలకు తెరలేపారు కొందరు వ్యక్తులు. రాముడు వనవాసం చేసిన పర్ణశాలలో అడుగు పెట్టి అడుగు తీస్తే చాలు భక్తులను అందినకాడికి దండుకుంటున్నారు. వనవాస ప్రధాన ఘట్టాలైన పర్ణశాల కుటీరం, సీతమ్మ నారచీరేలు, సీతారాములు ఆడుకున్న వామనగుంటలు, శూర్పణక చెవులు, ముక్కు కోసిన ప్రాంతం ఇలా ఎంతో చారిత్రాత్మక ఘట్టాలను చూపిస్తూ ఒక్కోదానికి ఒక్కో రేటు ఫిక్స్ చేస్తున్నారు. శ్రీసీతారాముల సాక్షిగా ముక్కు పిండి మరీ భక్తుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా రాముడు విల్లు ఎక్కుపెట్టి కొట్టగా పసువు, కుంకుమ వచ్చినట్లు చెప్తూ ఆ రంగులను పోల్చి ఉన్న రాళ్లను అమ్ముతూ భక్తుల దగ్గర డబ్బులు దోచుకుంటున్నారు. రాముడి పాదాలకోరేటు, శూర్పణక గుట్ట, సీతమ్మ నారచీరలు, వామనగుంటలు స్టోరీ చెప్తూ జేబులకు చిల్లులు పెడుతుండటంతో రామభక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో వచ్చిన రామభక్తులకు అక్రమ వసూళ్ల తతంగంతో అయ్యో రామ ఏమిటి ఈ ఖర్మ అని బేజారించుకుంటున్నారు. వనవాసం చేసిన తిప్పలు నీకు, అవి చూడడానికి వచ్చిన మాకు వసూళ్ల రాయుళ్ల తిప్పలు అంటూ దేవస్థానం అధికారుల పర్యవేక్షణ లోపంపై రామభక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవిత్ర పర్ణశాల క్షేత్రంలో ఎక్కడో సుదూర ప్రాంతాల నుంచి దర్శనానికి వచ్చే భక్తులను అక్రమ వసూళ్లు చేస్తూ.. ఈ క్షేత్రానికి ఉన్న పేరును చెదగొడుతున్నారు కేటుగాళ్లు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆలయ పవిత్రతను కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

## నా భార్య కొడుతుంది.. చంపేస్తుందేమో..

## నన్ను కాపాడండి.. వేడుకున్న ఇంగ్లీష్ ప్రొఫెసర్!

తన భార్య నుండి తనకు , తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలంటూ ఓ బాధిత భర్త పోలీసులను వేడుకున్నారు. పెళ్ళైనప్పటి నుండి తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తుందని బాధితుడు టెమూజియన్ ఆవేదన వ్యక్తం చేశాడు. హైదరాబాద్ హైదర్ గూడ లోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒంటిపై భార్య చేసిన గాయాలను చూపిస్తూ , మీడియాతో తన గోడును చెప్పుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజోలు ప్రాంతానికి చెందిన టెమూజియన్‌కు అమలాపురంనకు చెందిన లక్ష్మీ గౌతమితో ఏడేళ్ల క్రితం వివాహం జరిగినట్లు తెలిపాడు. మల్లారెడ్డి కాలేజీలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పని చేస్తూ, భార్యతో కలిసి అల్వాల్ లో నివాసం ఉంటున్నట్లు వివరించాడు. తమకు ఐదేళ్ల కొడుకు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే పెళ్లైనప్పటి నుండి భార్య తనను అకారణంగా హింసిస్తుందని తెలిపాడు. పలుమార్లు పెద్ద వాళ్ళ సమక్షంలో మాట్లాడిన ఆమె తీరు మారలేదన్నారు. ఇటీవల తనను చంపేందుకు కత్తితో దాడి చేసినట్లు కన్నీరు పెట్టుకున్నాడు. ఈ విషయంపై స్థానిక అల్వాల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసానని.. అయితే, పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ఒక చట్టం, పురుషులకు ఒక చట్టం ఉంటుందా అని ప్రశ్నించారు. తాను నిన్నటి నుండి ఇంటికి వెళ్లలేదని, వెళ్తే తన భార్య మళ్ళీ దాడి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశాడు. పోలీసులు తన భార్యపై కేసు నమోదు చేసి, తనకు రక్షణ కల్పించాలని బాధిత భర్త వేడుకున్నాడు.

## పిడుగుపాటుకు ముగ్గురి మృతి

**హైదరాబాద్ :** వికారాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. జిల్లాలో కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన యాలాల్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మృతులు వెంకటయ్య, శ్రీనివాస్, లక్ష్మప్పగా గుర్తించారు. కాగా, గాలివాన బీభత్సానికి పలుచోట్లు చెట్లు నేలకూలాయి. కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. పలుచోట్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జగిత్యాల జిల్లాలో రెండు లారీలు ఢీ..

## ఒకరు మృతి, భారీగా ట్రాఫిక్ జాం

**హైదరాబాద్ :** జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రెండు లారీలు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన కొడిమ్యాల మండలం పూడూరు గ్రామ బ్రిడ్జి పైనా ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పాలు సరఫరా చేసే లారీ డ్రైవర్ దామెర రాజేందర్ రెడ్డి మృతి చెందాడు. బ్రిడ్జి పైనా రెండు వాహనాలు పడి పోవడంతో కరీంనగర్– జగిత్యాల రహదారిపై కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.